క్లుప్తంగా

నివాళి


నివాళులర్పిస్తున్న కుమారస్వామి రెడ్డి

నగరి : అనంతపునాయుడుకండ్రిగలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ నేత విజేంద్ర భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ నాయకుడు కుమారస్వామిరెడ్డి సోమవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. విజేంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రుని రోడ్డుపై వదలి ట్రాక్టర్ డ్రైవర్ పరారైనట్లు తెలిసిందన్నారు. దీనిపై పోలీసులు విచారణ చేసి హిట్ అండ్ రన్ చట్టం కింద ట్రాక్టర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

శ్రీరంగరాజపురం: ప్రజలు సమస్యలపై ఇచ్చే వినతుల విషయంలో సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. సోమవారం తన కార్యాలయంలో తహసీల్దార్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై 14 వినతులు అందాయి. వీటిలో మ్యుటేషన్ 5, శ్మశానానికి దారి 1, భూసర్వే 2, ఇంటి నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 2, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని 2, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులను చూపించాలని 2 చొప్పున వినతులు ఉన్నాయి. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరు జాప్యం లేకుండా చూడాలని తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

24వ జిల్లా మహాసభ జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కోదండయ్య

నగరి: 24వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ పట్టణ కార్యదర్శి వేలన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరిలో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉద్యోగ, కార్మిక, రైతాంగ సమస్యలతోపాటు విద్యుత్ చార్జీలు, రంగు నీళ్లకు వ్యతిరేకంగా పలు పోరాటాలు చేసిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. పార్టీ నాయకులు బాషా, సాల్మన్, ముత్తు, సురేష్, నాగూర్, ఏఐటీయూసీ నాయకులు చెందమార్తై, యువజన సంఘం నాయకులు నేతాజి, నరేష్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వైద్యుడి మృతి

తిరుపతి తుడా : ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ ఎం.నరేంద్ర (55) సోమవారం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. విధినిర్వహణలో భాగంగా రౌండ్లకు వెళుతుండగా హార్ట్ స్ట్రోక్ రావడంతో కుప్పకూలిపోయారు. రుయా ఎమర్జెన్సీ వార్డులో ప్రథమ చికిత్స అనంతరం. మెరుగైన వైద్యం కోసం స్విమ్స్ హాస్పిటల్‌కు తీసుకెళుతుండగా మరణించారు.

సేంద్రియం..ఆరోగ్యానికి అభయం


వేలావడిలో జీవామృతం కలుపుతున్న రైతు


ఎం.కొత్తూరులో జీవామృతం తొట్టె నిర్మించుకుంటున్న రైతు

నగరి మండలంలోని రైతులు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపుతున్నారు. వేలల్లో ఖర్చయ్యే రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వాడకానికి స్వస్తి పలికి స్వంతంగా కషాయాలను తయారు చేస్తున్నారు. పంచగవ్య, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం, నీమాస్త్రం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, కంపోస్టు, వేపపిండి మొదలైనవి వాడి ఆరోగ్యకరమైన వ్యవసాయోత్పుల దిశగా సాగుతున్నారు.

సుస్థిర వ్యవసాయం వైపు ..రైతుల చూపు
- పెరుగుతున్న జీవామృతం తొట్టెల నిర్మాణం
- ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు
- నగరి మండలంలోనే 250 ఎకరాల్లో సేంద్రియ పద్ధతుల్లో పంటల సాగు

నగరి: నియోజకవర్గంలోని ఒక్క నగరి మండలంలోనే 250 ఎకరాల వరకు సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. ఈ విధానంలో భూసారం మరింత పెరగడం, దిగుబడి ఎక్కువగా పొందడం, వర్మీ కంపోస్టు మొదలైన వాటి గురించి వ్యవసాయాధికారులు రైతన్నలకు అవగాహన కల్పిస్తుండడానికి తోడు రసాయనిక ఎరువుల వాడకంతో భూములు క్రమేణా చౌడు బారడం గురించి తెలియజేస్తుండడంతో రైతన్నల ఆలోచన దృక్పథం మారుతోంది. రసాయనిక ఎరువులతో పండించే పంటల కన్నా సేంద్రియ వ్యవసాయం పంటలే ఆరోగ్యానికి శ్రేష్టమని చెబుతుండడంతో ప్రజల్లో కూడా ఈ పద్ధతుల్లో పండించిన కూరగాయాలు, పంటల కొనుగోలుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. నగరి మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశనగ చెరకు, పూల తోటలు, మల్బరి, కూరగాయలు ..ఇలా డివిజన్ పరిధిలో 650 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేస్తున్నారు.

శాశ్వత ప్రాతిపదికన జీవామృతం తొట్టెలు

ఘనజీవామృతంను పిడకల రూపంలో తయారు చేసి నిల్వ ఉంచుకునే రైతులు ద్రవ జీవామృతాన్ని ప్లాస్టిక్ తొట్టెలు, క్యాన్లలో నిల్వ ఉంచడం చేసేవారు. అయితే ఈ ప్లాస్టిక్ క్యాన్లు చోరీలకు గురికావడంతో కొత్త ఆలోచనతో శ్రీకారం చుట్టారు. పొలానికి నీరు పారించే కాలువల పక్కనే సిమెంటు ఒరలతో 500 లీటర్ల సామర్థ్యం ఉన్న తొట్టెలను పక్కాగా నిర్మిస్తున్నారు. ఈ తొట్టెలకు అడుగున కొళాయి ఏర్పాటు చేసి నీరు పారే కాలువల్లో వదిలేస్తున్నారు. ఇలా చేయడం వల్ల నీటితో కలిసి ద్రవ జీవామృతం సమంగా పొలానికి పారుతూ సత్ఫలితాలు ఇస్తుండడంతో నగరి డివిజన్ పరిధిలోని మండలాల్లోనే 60 మంది రైతులు తమ పొలాల్లో శాశ్వత ద్రవ జీవామృత తొట్టెలను నిర్మించుకొని రాష్ట్రంలోని రైతులందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.


కృష్ణరామాపురంలో జీవామృతం సిద్ధం చేస్తున్న రైతు

ప్రకతి వ్యవసాయంతో ఆరోగ్యం



ప్రకతి వ్యవసాయం పద్ధతుల్లో సాగుచేస్తే అధిక దిగుబడి రావడంతో పాటు ఆరోగ్యకరమైన పంట చేతికొస్తుంది. సేంద్రియ ఎరువుల తయారీలో సందేహాలు ఉంటే 9502398214 నంబరుకు సంప్రదిస్తే వారికి అవగాహన కల్పిస్తాం. వాడే విధానాన్ని రైతులకు తెలియజేస్తాం. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులైన సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలవైపు రైతులను తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

- చంద్రశేఖర్, మాస్టర్ ట్రైనర్, ప్రకృతి వ్యవసాయం

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద తెలిపారు. ఆమె మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ తత్సమాన విద్యార్హత కలిగిన అభ్యర్థులు కళాశాలలో చేరేందుకు అర్హులన్నారు. కళాశాలలో బీఏ హానర్స్ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ గ్రూపులుఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జెరాక్సులు తెచ్చి మంగళవారం నుంచి అడ్మిషన్లు పొందవచ్చన్నారు. ఇతర వివరాలకు సెల్: 98857 25771, 77029 17803 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దాహార్తి సమస్యలను తీర్చిన సర్పంచ్


బోరుమోటారు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ మహేష్, సత్యనారాయణ

పాలసముద్రం : మండలంలోని శ్రీకావేరిరాజుపురం దళితవాడ, మిట్ట దళితవాడల దాహార్తి సమస్యలను సర్పంచ్ మహేష్, మండల విస్తరణాధికారి సత్యనారాయణ పరిష్కరించారు. ఈ గ్రామాలకు సంబంధించి రెండు బోరు మోటార్లు పనిచేయకపోవడంతో తాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించారు. పంచాయతీల్లో నిధులేకున్నా సర్పంచ్ బోరు మోటారును రిపేరు చేయించి, బిగించి, తాగునీటి సమస్యను పరిష్కరించారు. గ్రామస్తుల అభినందనలు అందుకున్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం


మాట్లాడుతున్న మేయర్ అముద, పాల్గొన్న అధికారులు, కార్పొరేటర్లు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం పాలకవర్గం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మేయర్ అముద అధ్యక్షతన జరిగి సమావేశంలో కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, సభ్యులు నిర్మల, శశికుమార్, సుష్మా, అశోక్ పాల్గొన్నారు. నగరంలోని పలుచోట్ల బీటీ రోడ్లు, మురుగునీటి కాలువలు, నిర్దేశించిన ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలు, ప్రహరీ నిర్మాణాలకు టెండర్లు పిలవగా.. వాటిని ఆమోదించారు. 8వ డివిజన్‌లోని వెంగళరావు కాలనీలో నీటి ప్రవాహానికి సంబంధించి శాశ్వత పరిష్కారంలో భాగంగా మేజర్ స్టామ్ వాటర్ డ్రైన్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా కు.ని. చేయడానికి పరికరాలు, మందుల కొనుగోలుకు అంగీరించారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తూ మృతి చెందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడానికి పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ పాల్గొన్నారు.

స.హ చట్టంతో ప్రజాస్వామ్యం బలోపేతం


బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధ్యాపక బృందం

పుత్తూరు: దేశ ప్రజాస్వామ్యాన్ని సమాచార హక్కు చట్టం మరింత బలోపేతం చేస్తుందని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి అన్నారు. సమాచార హక్కు చట్టం ఆవిర్భవించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం వల్ల ప్రజలకు పలు రకాలుగా మేలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. దేశంలో అవినీతి తగ్గుతుందన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇక్కడ గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజర్‌కు దేహశుద్ధి

రేణిగుంట: జన్మమెత్తితివి..అనుభవించితివి..అని ఈవ్‌టీజర్‌కు దేహశుద్ధితో ఆ గ్రామస్తులు జ్ఞానోదయం కలిగించారు. కాలేజీకి వెళ్తున్న విద్యార్థినులను దారి కాచి వెకిలి చేష్టలతో ఇబ్బంది పెడుతున్న ఓ వివాహితుడికి తమదైన శైలితో బుద్ధి చెప్పి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని ఎర్రమరెడ్డిపాలెం నుంచి తిరుపతికి వెళ్లి డిగ్రీ చదువుతున్న ఇద్దరు అమ్మాయిలను పరంధామ (32) అనే వ్యక్తి నెలరోజులుగా దారి కాచి వెకిలి చేష్టలతో వేధిస్తున్నాడు. విసిగి వేసారిన ఆ అమ్మాయిలు తమ పెద్దలకు చెప్పారు. దీంతో సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలోకి వచ్చిన ఆ వ్యక్తిని పట్టుకున్నారు. ఆపై జరగాల్సిన కార్యక్రమాలు ఆటోమేటిగ్గా జరిగిపోయాయి. అంతే..! తదనంతరం గాజులమండ్యం పోలీసులకు అప్పగించారు. యర్రావారిపాళెం మండలానికి చెందిన ఇతడు వివాహితుడు కూడా. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో నివాసం ఉంటున్నాడని తేలింది. ఇతడు రేణిగుంట ఎస్టేట్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తూ చివరకు ఇలా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతూ అడ్డంగా బుక్ అయ్యాడు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపండి


ప్రకృతి వ్యవవసాయ పద్ధతుల్లో పండించిన కూరగాయలను విక్రయిస్తున్న పుష్ప

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాని ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్, నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప కోరారు. సోమవారం క్రిష్ణజమ్మపురం యూనిట్ గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఐకేపీ ఆవరణలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పుష్ప మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన చెరకు నుంచి తయారు చేసిన బెల్లం తీసుకునేందుకు తిరుపతి-తిరుమల దేవస్థానం సిద్ధంగా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో చెరకు విత్తనం నుంచి విత్తడం, సేంద్రియ ఎరువులు, కషాయాల తయారీ, వాడకంపై అవగాహన కల్పించారు. అలాగే కిచెన్ గార్డెన్ గురించి తెలియజేశారు. వరిపంటను ఆశించే తెగుళ్ల నివారణకు పేడ, ఇంగువతో చేసిన ద్రావణం వినియోగించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలను, అరటి పండ్లను విక్రయించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షురాలు, మునియమ్మ, కోశాధికారి నిర్మల, స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం: మండలంలో డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి ఘనంగా పూజలు చేశారు.వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పంచామృతంతో అభిషేకించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇదే రీతిలో చవటగుంటలో ఉన్న ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయంలో ఘనంగా అభిషేక పూజలు చేశారు.

ఆస్తులకు ఆటో మ్యుటేషన్

ప్రభుత్వశాఖల సమన్వయం, సంస్కరణల పేరిట సర్కారు ఆదాయ మార్గాలకు కొత్త దారి ఎంచుకుంది. ఇక మీదట ఇంటి, నీటి పన్ను బకాయిలు ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్ జరగవు. గతంలో ఈ పన్నుల బకాయిలు ఉన్న రిజిస్ట్రేషన్లు జరిగేవి. తరువాత వినియోగదారుడు మున్సిపల్ కార్యాలయంలో మ్యుటేషన్ చేసుకునేవారు. ఈ ప్రక్రియలో పన్ను బకాయిలు ఉన్నా.. రిజిస్ట్రేషన్ శాఖకు వాటితో సంబంధం లేదు గనుక రిజిస్ట్రేషన్ చేస్తారు. తదుపరి మ్యుటేషన్ (ఓనర్‌షిప్ మారడం) ప్రక్రియను పూర్తి చేస్తారు. సచివాలయాల నుంచి నగరపాలక కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం పరిశీలన అయ్యాక టైటిల్ మార్పు చేసి పన్ను విధిస్తారు. ఈ విధానంలో మార్పు తీసుకొస్తూ ఆటో మ్యుటేషన్ పేరిట కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు.

- ఆగస్టు 1 నుంచి సరికొత్త విధానం అమలు
- పన్ను బకాయిలు ఉంటే స్లాట్ బుక్ అవ్వదు
- మార్కెట్ విలువ, విస్తీర్ణం ఆధారంగా మ్యుటేషన్ చార్జీలు
- నగరవాసులకు ఎంతో ప్రయోజనం అంటున్న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు



చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: వ్యవసాయ పొలాలకు మాత్రమే ప్రస్తుతం ఆటోమ్యుటేషన్ విధానం అమల్లో ఉంది. వాటిని నగరాల్లోని ఇళ్లు, వాణిజ్య సముదాయాలకు ఆగస్టు 1 నుంచి అమలు చేయనున్నారు. తొలుత ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా విజయవాడలో అమలు చేశారు. అక్కడ ఆశించిన స్థాయిలో ఆదాయం రావడంతో రాష్ట్రవ్యాప్తంగా 17 కార్పొరేషన్ల పరిధిలో అమలు చేయనున్నారు. నగరాల్లో ఏదైనా స్థలం లేదా ఇళ్లు తీసుకుంటే కొనుగోలుదారులు ఆస్తిని తమ పేరిట మార్చుకునేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో వీటి కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పుడు అలా కాకుండా ఆస్తి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా ఆటో మ్యుటేషన్ జరగనున్నది. వీటిపై నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్‌తో కలిసి జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి, సబ్‌రిజిస్ట్రార్లు, డ్యాకుమెంట్ రైటర్లకు వీటిపై అవగాహన కల్పించారు.

బకాయిలు ఉంటే స్లాట్ బుక్ అవ్వదు

గతంలో స్థలాలు, ఇళ్లు, వాణిజ్య సముదాయాల రిజిస్ట్రేషన్‌కు మ్యుటేషన్‌కు సంబంధం లేదు. పన్ను బకాయిల విషయం వారికి పట్టవు. రిజిస్ట్రేషన్ అయ్యాక కొనుగోలుదారులు ఆ పత్రాల వివరాలతో నగరపాలక కార్యాలయంలో ఓనర్‌షిప్ మార్చుకోవడానికి దరఖాస్తు చేసేవారు. ఇక అలా కాకుండా రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ సమయంలోనే పన్నులు పెండింగ్ లేకుండా అప్‌డేట్ అయి ఉండాలి. సంబంధిత వివరాలను అప్‌లోడ్ చేశాక స్లాట్ బుక్ అవుతుంది. గతంలో రిజిస్ట్రేషన్ సమయంలో ఇంటికి చెల్లిస్తున్న రశీదు ఇవ్వాలి. స్థలమైతే (ఖాళీ స్థలం పన్ను) రశీదు అందజేయాలి. ఇంటి పన్ను సమర్పించాలి. ఒకవేళ ఒకే ఆస్తిని ఇద్దరూ లేదా ముగ్గురు కలసి కొనుగోలు చేసినా ఇదే విధానం వర్తిస్తుంది. మున్సిపాలిటీ ఇచ్చిన అసెస్‌మెంటు నంబర్లు తప్పక నమోదుచేయాలి. మార్కెట్ విలువ, విస్తీర్ణం ఆధారంగా మ్యుటేషన్ చార్జీలు చెల్లించాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కాగానే.. ఆ వివరాలను కార్పొరేషన్ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా తెలియజేస్తారు. అక్కడ పరిశీలించి ఓకే చెప్పగానే ఆటోమ్యుటేషన్ సర్టిఫికెట్ జనరేట్ అవుతుంది. ప్రక్రియ ముగిశాక అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా కొత్త డాక్యుమెంట్లతో పాటు ఆస్తి బదలాయింపు పత్రం కూడా పొందేలా ప్రక్రియ చేపట్టారు. మార్కెట్ విలువ, విస్తీర్ణం ఆధారంగా మ్యుటేషన్ చార్జీలు చెల్లించాలి. ఒక అసెస్‌మెంట్ నంబర్‌పై ఒకటి కంటే ఎక్కువ ఆస్తులున్నా.. పార్టుల వారీగా రిజిస్ట్రేషన్ జరిగినా ఆటోమ్యుటేషన్ జరిగిపోతుంది.

వినియోగదారులకు ఉపయోగకరం



ఆటోమ్యుటేషన్ విధానాన్ని కొత్తగా ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రవేశ పెట్టనున్నారు. రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ సమయంలోనే నగర పరిధిలోని ఆస్తుల అసెస్‌మెంట్ నంబర్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. అప్పుడు ఎటువంటి బకాయిలు ఉండరాదు. ఈ విధానంతో వేగంగా మ్యుటేషన్ జరుగుతుంది. వినియోగదారులకు ఉపయోగకరం.

–రమణమూర్తి, జిల్లా రిజిస్ట్రార్

యూరియా కోసం బారులు తీరిన రైతులు


క్యూలో ఉన్న రైతులు

బైరెడ్డిపల్లె: మండలంలో యూరియా కొరత నెలకొనడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బైరెడ్డిపల్లెకు చెందిన ఒక ఎరువుల దుకాణ యజమాని సోమవారం యూరియా లోడు తెప్పించారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని బారులు తీరారు. వారు మాట్లాడుతూ పంటలు సాగు చేయాలంటే ఎరువుల కొరత వుందని, అనేక కష్టాలకు ఓర్చి పంటలు పండించినా గిట్టుబాటు ధర అందక నష్టపోవాల్సి వస్తోందని వాపోయారు. ప్రభుత్వం చొరవ చూపి రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. గత ప్రభుత్వంలో ఎప్పుడూ ఎరువుల కొరత ఉండేది కాదని, ప్రస్తుతం ఎరువుల కొరత తీవ్రంగా నెలకొందని చెబుతున్నారు.

గాజుల అలంకరణ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని పొన్నియమ్మ(గ్రామదేవత)కు సోమవారం విశేష పూజలు చేశారు. ఈసందర్భంగా వేకువజామున అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. గాజులతో అలంకరణ చేశారు. ఈ అలంకరణ భక్తులను కనువిందు చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.